శిల్పారామంలో సిసి కెమెరాల సంఖ్య పెంచండి

ప్రజాశక్తి - కడప అర్బన్

శిల్పారామంలో సిసి కెమెరాల సంఖ్యను పెంచాలని రిమ్స్ సిఐ రామకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం శిల్పారామాన్ని సందర్శించారు. శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ నుంచి వివరాలు సేకరించారు. ఎన్ని సిఇస కెమెరాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న కెమెరాలను పరిశీలించారు.. కొన్నిచోట్ల సిసికెమెరాలను అమరచాలని సూచించారు. శిల్పారామం సెక్యూరిటీ సిబ్బందిని పెంచుకోవాలని చెప్పారు. అనంతరం సాంస్కృతిక కళా వెదిక మీద మిస్పా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ విద్యార్థులచే పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలు తో ప్రేక్షకులను అలరింప చేశారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్. కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

రబీలో పెరగనున్న సాగు విస్తీర్ణం

- వర్షాలపైనే రైతన్నల ఆశలు
- అన్ని రకాల పంటల సాగుపై దృష్టి
- నియోజకవర్గంలో 60 వేల ఎకరాలకుపైగానే సాగు
- మంజూరైన రాయితీ విత్తనాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈ ఏడాది రబీలో పంటల సాగు విస్తీర్ణం పెరగనుంది. ఈనెల నుంచే రబీ సీజన్ ప్రారంభం కానుంది. ఇందుకోసం రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ అనుకున్న రీతిలో సాగు కాలేదు. దీంతో పొలాలన్నీ బీళ్లుగా ఉండిపోయాయి. అరకొర వర్షాలతో రైతులు పంటల సాగుకు వెనుకంజ వేశారు. ఆలస్యంగా వర్షాలు కురిసినా భూములు పదును కాలేదు. దీంతో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమైనా సకాలంలో పంట వేయలేక పోవడంతో పంటలు సాగు కాలేదు.

సకాలంలో వర్షాలు వస్తాయని రైతన్నల ఆశ

రబీలో పంటలు సకాలంలో సాగవుతాయనే ఆశ రైతులలో బలంగా ఉంది. తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే భూములు చాలా వరకు పదును అయ్యాయి. అక్టోబరు మొదటి వారంలో పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా వేరుశనగ పంట అధికంగా సాగు చేయనున్నారు. ఇందుకోసం ఎరువులను, విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. సెప్టెంబర్‌లో నెలకొన్న అల్పపీడనాల వల్ల జిల్లాలో అడపాదడపా వర్షాలు పడ్డాయి. ఫలితంగా భూమి పదును కావడంతో ఈనెల నెల నుంచి పంటల సాగుకు రైతులు సిద్ధమవుతారు.

పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు

రబీలో పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. రైతులు రసాయనిక ఎరువులు వాడకంలో పంటలు సాగు చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు అధికమవుతున్నాయి. ఎరువుల ధరలు, సేద్యపు ఖర్చులు, విత్తనాల ధరలు పెరిగాయి. సాగు చేయాలన్న ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి అవుతున్నాయని రైతులు అంటున్నారు. వంటలు సాగు చేశాక కలుపు తీత పనులు, తెగుళ్ల నివారణకు మందులు స్ప్రే చేయడం ద్వారా ఖర్చులు పెరిగి పోతున్నాయి.

రబీలో పెరగనున్న సాగు విస్తీర్ణం

ఈ ఏడాది రబీ పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఖరీఫ్‌లో వర్షాభావంతో పంటలు లేక పొలాలన్నీ బీళ్లుగా ఉన్నాయి. రబీకి మొత్తం వ్యవసాయ పొలం అంతా పంటల సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఖరీఫ్‌లో పంటల సాగు చేస్తే ఆ పొలంలో తదుపరి వంటను రైతులు సాగు చేసేవారు కాదు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు కాకపోవడంతో రబీలో సాగు విస్తీర్ణం పెరు గుతుందనే అంచనా ఉంది. గత ఏడాది 50వేల ఎకరాలలో పంటలు సాగైతే. ఈ ఏడాది 20 శాతం పంటలు సాగు పెరుగు తందనేది వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

ఈ ఏడాది రబీలో 60వేల ఎకరాలకుపైనే పంటలు సాగవుతాయనే అంచనా ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రకాల పంటలు కలుపుకొని సాగవుతాయి. నియోజకవర్గంలో శనగ పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. సింహాద్రిపురం లింగాల మండలాలలో అత్యధికంగా శనగ పంటను సాగు చేస్తారు. అయితే మినుము పంట తర్వాత స్థానంలో సాగవుతుంది. పెసర, కంది, నువ్వులు, వేరుశనగ పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే వ్యవసాయ బోర్లు, బావుల కింద మినుము పంట సాగైంది. అంతేకాక తుపాన్ ప్రభావంతో వర్షాలు పడి పొలాలు పదును కావడంతో బోర్ల కింద ఈనెలలోనే మినుము పంటను రైతులు సాగు చేస్తున్నారు.

రాయితీ విత్తనాలు మంజూరు

రబీ సాగుకు కావాల్సిన విత్తనాలను వ్యవసాయ అధికారులు అంచనా వేసి నివేదికలు పంపించారు. ప్రభుత్వం కూడా రాయితీ విత్తనాలను మంజూరు చేశారు. అత్యధికంగా రబీలో శనగ పంట సాగు చేస్తారు కాబట్టి నియోజకవర్గానికి 7900 క్వింటాళ్లు మంజూరయ్యాయి. మండలాల వారీగా వేములకు 1400, పులివెందులకు 500, తొండూరుకు 1200, సింహాద్రిపురానికి 2700, లింగాలకు 1100 క్వింటాళ్లు కేటాయించారు. చక్రాయపేట మండలంలో శనగ పంట సాగు చేయరు కాబట్టి ఆ మండలానికి కేటాయించలేదు. అలాగే నియోజకవర్గానికి మినుము 105 క్వింటాళ్లు, వేరుశనగకాయలు 820 క్వింటాళ్లు, పెసర 305 క్వింటాళు కేటాయించారనివ్యవసాయ అధికారులు తెలిపారు.

రబీ సాగుకు భూమిని సిద్ధం చేస్తున్న రైతు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ అస్తవ్యస్తం

- సర్వర్ టెక్నికల్ సమస్య పరిష్కరించాలి
- దళారులు, రాజకీయ జోక్యం నివారించాలి
- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీకి శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా కడప నగరంలో నిర్వహిస్తున్న స్మార్ట్ కార్డుల పంపిణీ చాలా అస్తవ్యస్తంగా ఉందని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డు కోసం రేషన్ షాపుల చుట్టూ ప్రజలు తిరుగుతున్నారని పేర్కొన్నారు. తమ కార్డు సచివాలయం పరిధిలో మ్యాపింగ్ ఎక్కడ అయిందో చాలామందికి అర్థం కావడం లేదని తెలిపారు. బాడుగ ఇళ్లల్లో నివసిస్తున్న వారు చాలామంది స్మార్ట్ కార్డు కోసం రేషన్ షాపులు చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. ఆటో ఛార్జీల భారం పడుతుందని, తక్షణమే రేషన్ షాపుల డీలర్లు ఆ రేషన్ షాప్ పరిధిలో కార్డు హోల్డర్ల పేర్లను నోటీసు బోర్డులో ప్రకటించాలన్నారు. స్మార్ట్ కార్డు పంపిణీ సమయంలో కార్డుహోల్డ్ దారుల పట్ల కొంతమంది డీలర్లు ప్రజలను చులకనగా, హేళనగా మాట్లాడుతున్నారని వాపోయారు. తక్షణమే డీలర్లు కార్డుదారులతో గౌరవంగా మాట్లాడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంపిణీ సమయంలో సర్వర్, టెక్నికల్ సమస్యలతో చాలామంది కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులో పేరున్న కార్డు యజమాని మాత్రమే రావాలనే నిబంధన సడలించాలని పేర్కొన్నారు. స్మార్ట్ కార్డులో పేరున్న వ్యక్తి ఎవరు వచ్చినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ కార్డు పంపిణీలో రాజకీయ పలుకుబడి, దళారుల వ్యవస్థను అరికట్టాలని, తక్షణమే పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు జోక్యం చేసుకుని స్మార్ట్ కార్డుల పంపిణీని సజావుగా జరగేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో స్మార్ట్ కార్డు దారులందరిని కలుపుకుని పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, నగర నాయకుల నరసింహ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి : యుటిఎఫ్

నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని వివిధ కెజిబివిలలో పనిచేస్తూ 2025 మెగా డిఎస్‌సి పరీక్ష రాసి మెరిట్ సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను యుటిఎఫ్ కడప జిల్లా శాఖ అభినందించింది. మంగళవారం కడప యుటిఎఫ్ భవన్‌లో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ అకుంఠిత దీక్షతో ఒకవైపు విధులు నిర్వహిస్తూ మరొకవైపు కఠోర శ్రమతో ఆంధ్ర సివిల్స్ డిఎస్‌సి పరీక్షల్లో ప్రతిభను చాటి పాఠశాల సహాయకులుగా ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. జిల్లాలోని వివిధ కస్తూర్బా పాఠశాలలు చాపాడు నుంచి ప్రసన్నలక్ష్మి, కోడూరు నుంచి మమోల, పెద్దముడియం నుంచి మేరమ్మ, ఓబులమ్మ, గంగా శిరీష, మైదుకూరు నుంచి హరిత, జమ్మలమడుగు నుంచి కళావతి, గీత, వేముల నుంచి నాగమల్లేశ్వరమ్మ, వల్లూరు నుంచి పున్నమ్మ మెరిట్ సాధించారన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారు హక్కులతో పాటు విధుల పట్ల అంకిత భావాన్ని కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషిచేస్తూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు ఎడి దేవదత్తం పాల్గొన్నారు.

మురళీ యాదవ్ సేవలు అభినందనీయం

- ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రమశిక్షణ, అంకిత భావంతో 39 సంవత్సరాల పాటు జిల్లా పోలీస్ శాఖకు నిర్విరామంగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ విరమణ పొందిన మురళీ యాదవ్‌ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందచేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మురళీ యాదవ్ తన సర్వీస్‌లో ఎలాంటి రిమార్క్ లేకుండా విజయవంతంగా పోలీస్ విధి నిర్వహణ నిర్వర్తించడం సంతోషకరమన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగం చేయడం ఒక వరంగా భావించారని, పిల్లలకు మంచి విద్య అందించి వైద్య రంగంలో స్థిరపడేలా చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అదనపు ఎస్‌పి (పరిపాలన) కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ మురళీ యాదవ్ ఉన్నతాధికారులు ఏ విధులు అప్పగించినా సమర్థవంతంగా చేసేవారన్నారు. నచ్చిన వ్యాపకంతో శేష జీవితం గడపాలని సూచించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీస్సులతో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించానని, పోలీస్ శాఖలో 39 ఏళ్ళ సర్వీస్ ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్.సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ నాయక్, ఎఒ కె.వెంకటరమణ, ఆర్ఐలు శివరాముడు, సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్‌బి ఎస్ఐ మురళి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈ.సి మెంబర్ ఏప్రిన్, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

నిరసన తెలియజేస్తున్న మహిళా కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

గుంటూరు నగరంలో మహిళ కార్మికురాలని చెప్పలేని భాషలో తిట్టిన జనసేన కార్పొరేటర్ పై చర్యలు తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరామ్ పేర్కొన్నారు. పారిశుధ్య మహిళా కార్మికులు మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారు జామున మాస్టర్ అనంతరం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ కార్పొరేటర్ చర్యను ఖండిస్తున్నట్లు చెప్పారు. దుర్మార్గమైన పదజాలాలు ఇంకా వింటూ ఉండడం సిగ్గుచేటు అన్నారు. కులం, మతం పేరుతో అసహ్యంగా మాట్లాడడం దారుణమన్నారు. జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్‌ను పదవి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో రాష్ట్ర ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి - కడప అర్బన్

బైక్ మెకానిజం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇంటర్నెట్‌షిప్ ఉపయోగపడుతుందని ప్రధానోపాధ్యాయులు సమీర్‌బాష పేర్కొన్నారు. భాకరాపేట, 11వ బెటాలియన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పిఎం శ్రీ పథకం లోని ఒకేషనల్ కోర్సుల్లో భాగంగా ఆటోమోటివ్ విభాగంలో ఒకేషనల్ టీచర్ షేక్. మౌలాలి ఆధ్వర్యంలో ఇంటర్న్ షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మాధవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న 'టు వీలర్ సర్వీస్ పాయింట్లకు' విద్యార్థులను తీసుకెళ్లి ప్రాథమిక అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమం సెప్టెంబర్ 22 న ప్రారంభించామని పేర్కొన్నారు. అక్టోబర్ 1 వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో భవిష్యత్తుకి అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలతోపాటు కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలించారు. రానున్న దసరా పండుగ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

- బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రజాశక్తి - కడప

నిరసన తెలియజేస్తున్న వైసిపి నాయకులు

మెడికల్ కళాశాలల ప్రయి వేటీకరణను తక్షణం ఆపాలని, లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేయాల్సి వస్తుందని వైసిపి బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ హెచ్చరించారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ మంగళవారం వైసిపి ఎస్‌సి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కడప కొత్త ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధా మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేస్తే పేద సామాన్య విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేందుకు చాలా భారం అవుతుందన్నారు. వైద్య సేవలు కూడా పేద, సామాన్యులకు అందకుండా దూరమవుతాయని తెలిపారు. వైద్య విద్యను వాణిజ్య రంగంలోకి బదలాయిస్తే సమాజంలోని పేదలకు వైద్య వృత్తి అందని ద్రాక్షగా మారుతుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలను గత వైసిపి జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని ప్రయివేట్ భాగస్వామ్యంలోకి తీసుకురావడం దారుణం అన్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌సి, ఎస్‌టి ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందడం లేదని అన్నారు. ఇప్పటికైనా వైద్య కళాశాలలను ప్రైవేటు భాగస్వామ్యంలో కాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైసీపీ నాయకులు పులి సునీల్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు వినోద్ కుమార్, కార్పొరేటర్లు, మహిళా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విజయమ్మ, రితీష్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-కాశినాయన

విజయమ్మ, రితీష్‌రెడ్డి, రవీంద్రారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మను, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డిని, ఇటీవల ఎన్నికైన బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డిని మంగళవారం టిడిపి నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ముందుగా బసిరెడ్డి రవీంద్రారెడ్డిని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు రితీష్‌రెడ్డికి, విజయమ్మకు ఘనంగా శాలువాలతో పూలదండలతో సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవికి ఎన్నిక చేసినందుకు విజయమ్మకు, రితీష్‌రెడ్డికి, పార్టీకి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. అందరి సహకారంతో తన వంతు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొండా రామసుబ్బారెడ్డి, వేములకోట బాదుల్లా, దిన్నెపు కృష్ణారెడ్డి, కిట్టయ్య, ఈశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఖాజావాలి నరసాపురం సర్పంచ్, పోల్ రెడ్డి ఉప్పలూరు, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగరవనం సుందరీకరణకు చర్యలు

ప్రజాశక్తి -గోపవరం

బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండల పరిధిలోని సెంచరీ ప్యానల్స్ లిమిటెడ్ సమీపంలో ఉన్న నగరవనాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితీశ్ రెడ్డి సోమవారం పరిశీలించారు. నగరవనం అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను అధికారులు సమీక్షించి, అమలు చేయాల్సిన ప్రణాళికలను వివరించారు. త్వరలోనే అత్యంత వైభవంగా నగరవనాన్ని తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని రితీశ్ రెడ్డి తెలిపారు. ఆయనతో పాటు డిఎఫ్ఒ వినీత్‌కుమార్, ఆర్‌డిఒ చంద్రమోహన్, తహశీల్దార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డైరెక్టర్ల నియామకంలో నలుగురికి చోటు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎపిలో మరో రెండు కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం డైరెక్టర్లను నియమించింది. ఎపి రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి, ఎపి బెస్త సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం చేపట్టింది. ఇందులో జిలాల్కుఉ చెందిన నలుగురికి చోటు లభించింది. కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్లుగా కడప జనసేన పార్టీకి చెందిన కేతు బోయిన సురేష్ బాబు, టిడిపి నుంచి మైదుకూరుకు చెందిన దాసరి బాబుకు చోటు కల్పించారు. ఎపి బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా కమలాపురానికి చెందిన టిడిపి నాయకులు మల్లె వెంకటసుబ్బయ్య, కడపకు చెందిన రాంప్రసాద్‌కు చోటు దక్కింది.

భద్రతా నియమాలు పాటించాలి

- విద్యుత్ ఎస్ఇ రమణ

ప్రజాశక్తి - కడప

శక్తికి, విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ సందర్భంగా, జిల్లా ప్రజలందరూ విద్యుత్ భద్రతా నియమాలను తప్పకుండా పాటించి, ఉత్సవాలను సంతోషంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్. రమణ కోరారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. మండపాల వద్ద ఏర్పాటు చేసే లైటింగ్ అలంకరణలు, సౌండ్ సిస్టం, ఇతర విద్యుత్ ఉపకరణాల విషయంలో నిర్వాహకులు అత్యంత అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా భూమిపై తేమ ఎక్కువగా ఉందని ఇటువంటి పరిస్థితుల్లో, చిన్నపాటి అతుకులు ఉన్న, నాణ్యత లేని వైర్లు తీవ్రమైన విద్యుత్ షాక్‌లకు, ప్రమాదాలకు దారితీస్తాయని చెప్పారు. అందుకే నాణ్యమైన, అతుకులు లేని విద్యుత్ తీగలను, ప్రమాణిత ఉపకరణాలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులు విద్యుత్ అధికారులతో పూర్తి సమన్వయంతో పని చేస్తే, ఊరేగింపులు సురక్షితంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సిద్ధిధాత్రీ దేవిగా విజయదుర్గాదేవి

ప్రజాశక్తి-కడప అర్బన్

విజయదుర్గాదేవి 9వ రోజున సిద్ధిదాత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు పుణ్యనది జలాలతో నిండిన 81 విశేష కళశాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మను చక్కగా అలంకరించి షోడశోపచార పూజలు చేశారు. అనంతరం యగశాలలో చండీహోమం, శ్రీచక్రమండపంలో శ్రీచక్రార్చనలు ఆలయ అర్చకులు నిర్వహించారు. మంగళ వారం కావడం వల్ల 3 గంటల నుంచి 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. దుర్గాష్టమి ఆలయ ప్రాంగణం మొత్తం రాహుకేతు దీపాలతో కళకళలాడింది. విశేష పూజల్లో భాగంగా సాయంత్రం 4.30 నిలకు వివిధ రకాల పండ్లతో ఫలార్చన ఉభయదారులచే నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సిద్ధిదాత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ విజయదుర్గా మల్లికార్జునులు ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు, ఆలయ నిర్వాహకులు సుధా దుర్గాప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జర్నలిస్టులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఇటీవల కాలంలో మరణించిన, ప్రమాదానికి, అనారోగ్యానికి గురైన జర్నలిస్టు కుటుంబాలకు కడప వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ ఆర్థిక సాయం అందించింది. సుదీర్ఘకాలం ఆంధ్ర భూమి పత్రికలో పనిచేసిన ఇమామ్ ఆకస్మికంగా మరణించారు. ఆ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని ఇమామ్ కుటుంబానికి కడప ప్రెస్ క్లబ్ తరపున అందించారు. ప్రమాదాలకు, అనారోగ్యానికి గురైన టీవీ 9 స్టాఫ్ రిపోర్టర్ సుధీర్, ప్రైమ్ 9 స్టాఫ్ రిపోర్టర్ సుధీర్, సాక్షి టీవీ చీఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, ఎన్‌టివి కెమెరామెన్ చాంద్ బాషాకు ఒక్కొక్కరికి రూ.10 వేలు అందజేశారు. అనారోగ్యంతో ఉన్న జర్నలిస్టులకు అండగా ఉండేందుకు కడప ప్రెస్ క్లబ్ మూడేళ్ళుగా రూ.10 వేలు తక్షణ సహాయంగా అందిస్తోందని, మరణించిన వారికి రూ.20 వేలు అందిస్తున్నట్లు కన్వీనర్ లక్ష్మీనాథ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు రమేష్, మురళి, కిషోర్, శ్రీనివాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆనందం వ్యక్తం చేస్తున్న కువైట్ వైసిపి నాయకులు

రాజకీయ కక్షతోనే జైలుకు పంపారు

ప్రజాశక్తి - కడప

మూడు సార్లు ఎంపీగా గెలిచిన మిథున్‌రెడ్డికి రాజకీయ కక్షతోనే జైలుకు పంపారని వైసిపి గల్ఫ్ కన్వీనర్ బి.హెచ్. ఇలియాస్, కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు పేర్కొన్నారు. మిథున్ రెడ్డి రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్ పై విడుదల అయినా సందర్భంగా వైసిపి కువైట్ కమిటీ సభ్యులు మాలియా ప్రాంతంలోని పార్టీ ఆఫీసు వద్ద గల్ఫ్ కో - కన్వీనర్ ఆధ్వర్యంలో మంగళవారం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృదుస్వభావి, అనునిత్యం ప్రజల సంక్షేమం కోసం పాడుపడుతున్న మిథున్‌రెడ్డిని అక్రమ కేసులు బనాయించి జైలు పంపించడం అన్యాయమని అన్నారు. ఆయనకు వస్తున్న ప్రజాధారణ చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం ఇంతటి నీచమైన చర్యకు పాల్పడిందని తెలిపారు. కార్యక్రమంలో గల్ఫ్ ప్రతినిధి నాగిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు షేక్ రహమతుల్లా, సీనియర్ నాయకులు పూలపత్తూరు సురేష్ కుమార్ రెడ్డి, కమిటీ సభ్యులు అప్సర్ అలీ, అబ్బాస్, కిషోర్, హనుమంతు రెడ్డి, షంషుద్దీన్, షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కడప : దేశంలో దొంగ ఓట్లను కొల్లగొట్టి తద్వారా దొంగ మెజార్టీతో బిజెపితో పాటుగా వివిధ రాష్ట్రాల్లో దొంగ ప్రభుత్వాలు ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మయన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. కడప నగరంలో మంగళవారం 31వ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జి మయాన రహమతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో స్థానిక రెండవ గాంధీ విగ్రహం వద్ద ఓట్ చోర్ – గద్ది చోడ్‌లో భాగంగా ప్రజల సంతకాల సేకరణ శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలో పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల ఆదేశాల మేరకు ఓట్ల బిజెపి దొంగతనానికి వ్యతిరేకంగా ప్రజల సంతకాల సేకరణ విజయ వంత మైందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఇప్పటివరకు మూడుసార్లు కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కేవలం దొంగ ఓట్ల ద్వారానే ప్రభుత్వాలు ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిన ఘనత నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల భారతీయ జనతా పార్టీ చేస్తున్న దొంగ ఓట్ల కుంభకోణాన్ని బహిర్గతం చేయడంతో బిజెపి నాయకులు ఆయనపై కక్షగట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, 41వ డివిజన్ ఇన్‌ఛార్జి అమిత్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్‌బాషా, రఫీఖాన్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

తహశీల్దారు ఈశ్వరయ్యను సత్కరిస్తున్న ఆర్‌డిఒ చిన్నయ్య

నిజాయితీకి మారుపేరు ఈశ్వరయ్య

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నిజాయితీకి మారుపేరు లింగాల తహశీల్దారు ఈశ్వరయ్య అని పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో తహశీల్దారు ఈశ్వరయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరి 39 ఏళ్ల సర్వీసులో ఎలాంటి మచ్చ లేకుండా విధులు నిర్వహించారన్నారు. ప్రతి ఉద్యోగికి రిటైర్డ్‌మెంట్ తప్పనిసరి అన్నారు. తన శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఈశ్వరయ్య దంపతులను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిటి నరేంద్ర, మండల సర్వేయర్ పద్మావతి, ఇన్‌ఛార్జి ఆర్‌ఐ గంగాధర యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుగంధర్

పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లల్లో శాస్త్రీయత పెంచడమే చెకుముకి లక్ష్యమని చెకుముకి ఎడిటోరియల్ బోర్డ్ మెంబర్ యుగంధర్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి చెకుముకి ప్రశ్నాపత్రాల వర్క్‌షాప్ రెండు రోజులు స్థానిక జెవివి కార్యాలయంలో నిర్వహించారు. ఐదు జిల్లాల నుంచి రిసోర్స్ పర్సన్ వచ్చారు. రెండవ రోజు మంగళవారం యుగంధర్ మాట్లాడుతూ చెకుముకి సంబరాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఆలోచన విధానంలో తార్కికత మెరుగుపడుతుందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శివరాం మాట్లాడుతూ 35ఏళ్లుగా 8,9,10 తరగతుల విద్యార్థులకు వివిధ స్థాయిలలో వారి సామర్థ్యాన్ని వెలికి తీసే ప్రయత్నం చెకుముకి ద్వారా చేస్తున్నామన్నారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్ మాట్లాడుతూ ఈ సంబరాలలో సైంటిస్టులతో విద్యార్థుల ముఖాముఖి చర్చల ద్వారా వారిలో సైన్స్ పట్ల అభివృద్ధి పెరుగుతుందన్నారు. ప్రయోగాల ద్వారా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించడం అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలచైతన్య, మహేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జిలాని బాషా, మాదాల రాము, సునీత, జిల్లా గౌరవ సలహాదారులు గోపీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బయ్య, జెవివి నాయకులు తిరుమల కొండు, అల్లాబకాష్, మురళి గుప్తా, శివనాథ్ పాల్గొన్నారు.

పట్టా అందుకొంటున్న బాలకొండ గంగాధర్

తెలంగాణ గవర్నర్‌చే పట్టా అందుకున్న గంగాధర్

ప్రజాశక్తి - వేంపల్లె

తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా మంగళవారం వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు బాలకొండ గంగాధర్ పిహెచ్‌డి పట్టాను అందుకున్నారు. బాలకొండ గంగాధర్ 30 ఏళ్లుగా కడపలోని సుబ్బిరెడ్డి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా సేవలందిస్తున్నారు. గంగాధర్ ఇప్పటివరకు 10కిపైగా గ్రంథాలు రచించగా, 40 పరిశోధనా పత్రాలు దేశీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించారు. 2014లో ఎపి ఉత్తమ అధ్యాపక అవార్డును, 2015లో మహారాష్ట్ర గ్లోబల్ రోల్ మోడల్, ఎపి హయ్యర్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు, 2024లో ఆంధ్రప్రదేశ్ టూరిజం ఎక్సలెన్స్ ఇన్ రైటింగ్ అవార్డును సిఎం చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. పిహెచ్‌డి పట్టాను గంగాధర్ అందుకోవడంతో కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ నూతన కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించి జాయింట్ యాక్షన్ కమిటీ మైలవరం, పెద్దముడియం మండలాల నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా జేఏసీ కన్వీనర్ పెద్ద మస్తాన్ తెలిపారు. మంగళవారం మస్తాన్ ఆధ్వర్యంలో జమ్మలమడుగులో సమావేశం నిర్వహించారు. మైలవరం మండలానికి సంబంధించి గ్రామ వార్డు సచివాలయ మండల ప్రెసిడెంట్‌గా ఎస్.నిషార్ అహ్మద్, జనరల్ సెక్రెటరీగా టి.కళ్యాణ వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఎం.డి దిలీప్, కమిటీ మెంబర్స్‌గా సి.గురు గోవర్ధన్(బెస్త వేముల). పి.రవితేజా రెడ్డి(దొమ్మర నంద్యాల), ఎస్.సుభహాన్ (తొర్రివేముల), ఎస్.నాగలక్ష్మి(దొమ్మర నంద్యాల), ఎస్.బి.విష్ణు మోహన్‌రెడ్డి(వద్దిరాల)ని ఎన్నుకున్నారు. పెద్దముడియం మండలానికి సంబంధించి గ్రామ వార్డు సచివాలయ జేఏసీ ప్రెసిడెంట్‌గా ఎం.హెచ్. ప్రసాద్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా డి.చంద్రశేఖర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.లక్ష్మీ నాగేంద్ర, కమిటీ మెంబర్స్‌గా జి.విష్ణువర్ధన్ (భీమగుండం), టి.సతీష్‌కుమార్ (పాలూరు). కె.రాముశ్రీనాథ్ (జంగాలపల్లి), కె.విష్ణువర్ధన్ (పెద్దపసుపుల-2), రాము (పెద్ద పసుపుల-1), ఎం.ఈశ్వర్ (సుద్దపల్లి), కె.మల్లికార్జున (పెద్దముడియం), ఎస్.సునీల్ కుమార్ (గుండ్లకుంట), పి.రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - ఖాజీపేట

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించార. కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, స్థానిక అగ్రహారం శివాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బోసిరెడ్డిపల్లెలోని పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోపిరెడ్డి పెద్దిరెడ్డి, ఉదయభాస్కర్‌రెడ్డి అన్న ప్రసాద వితరణ చేశారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

వికలాంగులకు గృహోపకరణాలు వితరణ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ : ప్రముఖ వ్యాపారవేత్త కొర్రపాటి కిరణ్ కుమార్ జన్మది నోత్సవ సందర్భంగా మంగళవారం వికలాంగుల కమ్యూనిటీ భవనంలో దివ్యాం గులకు గృహోపకరణాలు అందజేశారు. కిరణ్ తండ్రి విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి కొర్రపాటి ప్రభాకర్ బర్త్ డే కేక్ కట్ చేసి దివ్యాంగ చిన్నారులకు పంపిణీ చేశారు. అనంతరం కిరణ్ ఆర్థికసాయంతో 30 మంది దివ్యాంగులకు కొర్రపాటి ప్రభాకర్ స్టీల్ క్యారియర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, కార్యదర్శి ఆర్.వెంకట సుబ్బయ్య, సంఘ కార్యవర్గ సభ్యులు సునీల్ పాల్గొన్నారు.

గోడేరు వంక వంతెన నిర్మాణమెప్పుడో..!

వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సీతారామపురం గ్రామ సమీపంలో గోడేరు వంకపై వంతెన నిర్మాణం ఎప్పుడో అని రైతులు ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అధికారులకు తమ సమస్యను విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రైతులు స్వతహాగా నిర్మించుకున్న బండరాళ్ల కట్టడాలు వర్షం ధాటికి కొట్టుకు పోయాయి. సీతారామాపురం గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులకు వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే వంక దాటుకొని పోవాల్సిన పరిస్థితి. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో వంక ఉధృతంగా ప్రవహిస్తూండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వ్యవసాయ పనులకు పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రొద్దుటూరు-మైదుకూరు ప్రధాన రహదారిపై నుండి పంట పొలాలకు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ మార్గాన దారి లేకపోవడంతో వంక నీటిలో నుంచి వెళ్లక తప్పడంలేదు. సంబంధిత అధికారులకు రైతులు పలుమార్లు విన్నవించినా ప్రతిపాదనలకే పరిమితమని రైతులు వాపోతున్నారు. రైతులు నడిచి వెళ్లేందుకు ఉన్న ఏర్పాటు కూడా తొలగిపోవడంతో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. రూ.50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయక పోవడంతో నిర్మాణానికి చర్యలు చేపట్టలేదని తెలుస్తోంది. పంటలు సాగు చేసిన సమయంలో, దిగుబడి చేతికి అందివచ్చిన సమయంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి స్వయంగా సమస్యను పరిశీలించి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. భూమిపూజ కూడా చేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వంతెన పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఉపయోగపడేలా వంతెన నిర్మించాల్సి ఉందని కోరుతున్నారు.

పంటల సాగు కష్టతరం..

గోడేరు వంక అవతలి వైపున పంటపొలాలు ఉండడంతో వంక నీటిలో వెళ్లి పంటలు సాగు చేయడం కష్టంగా మారింది. గత కొన్ని ఏళ్లుగా పరిస్థితి అధ్వానంగా ఉంది. ఉన్న భూములను సాగు చేసుకోలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంట పొలాలకు వెళ్లే ఏర్పాట్లు చేయాలి. మూడెకరాల సాగు భూమి ఉంది.

- సుబ్రహ్మణ్యం, సీతారామపురం.

కొట్టుకుపోయిన రాళ్ల కట్టడాలు..

గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు గోడేరు వంక దాటి వెళ్లాల్సి ఉంది. నదిలో నీరు ఉన్నప్పుడల్లా వంకలో కూడా నీరు అధికంగా ఉంటుంది. రైతులందరం కలిసి నడిచి వెళ్ళేందుకు ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రస్తుతం వర్షపు నీటి ఉధృతికి రాళ్లు కొట్టుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట పొలాలకు వెళ్లే దారిని ఏర్పాటు చేయాలి. లేదంటే పంటలు సాగు చేసుకునే పరిస్థితి ఉండదు. నాలుగెకరాల పొలం సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం.

- రాజశేఖర్, సీతారామపురం.

దసరా, దీపావళి వేళ టివిఎస్ ధమాకా ఆఫర్స్

ప్రతి స్కూటర్ కొనుగోలుపై రూ.7 నుంచి రూ.20 వేలు వరకూ క్యాష్‌బ్యాక్ : ప్రొప్రయిటర్ బి.శివకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

దసరా, దీపావళి పండుగల వేళ టివిఎస్ బైక్ కొనుగోలు దారులకు ధమాకా ఆఫర్స్ ఇస్తున్నారు. ఆ మేరకు జమ్మలమడుగు ఎస్ఎల్ఎన్ టివిఎస్ ప్రొప్రయిటర్ బి.శివకృష్ణారెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ జమ్మలమడుగులో తాడిపత్రి రోడ్డు, కరెంట్ ఆఫీస్ ఎదురుగా 2005లో ఎస్ఎల్ఎన్ టివిఎస్ షోరూంను ప్రారంభించామన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలతో తమ కొనుగోలు చేసిన వాహనదారుల నమ్మకంతో 20 ఏళ్ల పూర్తి చేశామన్నారు. ఎస్ఎల్ఎన్ టివిఎస్ ఆధ్వర్యంలో కేవలం రూ.6,000 నుంచి రూ.10వేలు వరకు డౌన్ పేమెంట్ చెల్లించి టివిఎస్ వాహనం నుంచి జూపిటర్ స్కూటీ వరకూ కొనుగోలు చేయవచ్చన్నారు. స్పాట్ ఎక్సేంజ్, ఆఫర్ స్పాట్ ఫైనాన్స్, స్పాట్ డెలివరీ ఇవ్వడానికి తమ కంపెనీ అన్ని విధాల సిద్ధంగా ఉందన్నారు. టివిఎస్ రోనిన్, అపాచీ, రైడర్, స్టార్ సిటీ వంటి పెద్ద వాహనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రతి మోటర్ సైకిల్ కొనుగోలుపై జిఎస్‌టి రూ.7,000 నుంచి రూ.20వేలు వరకు తగ్గించామన్నారు. ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసే వ్యక్తులు ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తమ వద్ద కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనదారులకు 10ఏళ్ల ఫ్రీ వారంటీ బెనిఫిట్స్, ప్రతి మోటర్ సైకిల్ కొనుగోలుపై ఎక్స్ ట్రా ఫిట్టింగ్ ఉచితంగా చేస్తామన్నారు. పూర్తి వివరాలకు 99482 75905, 94411 48402 నంబర్లను సంప్రదించాలని శివకృష్ణారెడ్డి సూచించారు.

జమ్మలమడుగులో ఉన్న ఎస్ఎల్ఎన్ టివిఎస్ షో రూమ్

అన్నిరకాల వసతులతో ఆస్పత్రి అభివృద్ధి

ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

అన్ని రకాల వసతుల కల్పనతో మైదుకూరు ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. ఆ మేరక మంగళవారం ఆయన ఆస్పత్రిలో కొత్త ఎక్స్ రే మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో డయాలసిస్ సెంటర్, పోస్టుమార్టం , అవుట్ పోస్ట్ మంజూరు కానున్నాయని తెలిపారు. డిఎంఎఫ్ కింద ఆర్ఓ ప్లాంట్, జనరేటర్, ఆక్సిజన్ సెంటర్ మౌలిక వసతులు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి కమిటీ సభ్యులు యాపరాల చిన్న మంచి ప్రయత్నం చేస్తున్నారని కొనియాడారు. ఆస్పత్రి నిర్వహణ తనకు చాలా బాగా నచ్చిందని ఎమ్మెల్యే మెచ్చుకున్నారు. సొంత నిధులు వెచ్చించి రోగులు కూర్చునేందుకు సిమెంటు బెంచీలు వేయించడం మంచిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కరీముల్లా, జ్యోష్నారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎపి రవీంద్ర, ధనపాల జగన్, కాలువ గురప్ప, కోన సుబ్బారావు, బండి అమర్నాథ్, తుపాకుల రమణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

చాపాడు : మైదుకూరు నియోజవకవర్గ పరిధిలో సిఎం సహాయక నిధికి సంబంధించి 22 మంది బాధితులకు రూ.22.95 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అన్ని రకాల సేవలకు ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. పథకం ద్వారా వైద్య సేవలు అందని వారు ఎవరైనా ఉంటే వారు ఆర్థికంగా నష్టపోకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్ రెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, దువ్వూరు మండల శాఖ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు ఆర్ఎంపి వైద్యులు వినతి

దువ్వూరు : తమకున్న సమస్యలను ఆర్ఎంపిలు మంగళవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తెచ్చారు. ఆ మేరకు వారు ఎమ్మెల్యేకు వినతి పత్రమిచ్చారు. ఆర్ఎంపి, పిఎంపి చికిత్స విధి విధానాలపై త్వరలో అధికారులతో చర్చిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిపై అన్ని విధాల చర్చిస్తామని తెలిపారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో మండల ఆర్ఎంపి ప్రతినిధులు కలిశారు. కార్యక్రమంలో దువ్వూరు పట్టణ అధ్యక్షులు పాపినేని రాంబాబు, ఆర్ఎంపి ప్రథమ చికిత్స మండల అధ్యక్షుడు అమీర్‌బాషా, ఉపాధ్యక్షులు ఎల్.తాహిర్ హుస్సేన్, కార్యదర్శి జయకీష్ణ, కోశాధికారి దస్తగిరి, సహాయ కార్యదర్శి కే.నరసింహులు, ఆర్ఎంపిలు షబ్బీర్ బాషా, శ్రీనివాసులు, శివప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

పెట్రోలు, డీజిల్, గ్యాస్‌పై జిఎస్‌టి తొలగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పెట్రోలు,టీజిల్ గ్యాస్‌పై జిఎస్‌టి తొలగిస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గించాం.. పండగ చేసుకోండి అని ప్రజలకు తెలపండి అని రాష్ట్రాల్లో ఉన్న పార్టీలకు కేంద్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. ఈనెల 16న కర్నూలు, నంద్యాలలో పర్యటనకు ప్రధాని వచ్చే సందర్భంగా పెట్రోలు, డీజిల్, గ్యాస్‌పై జిఎస్‌టి ఎత్తివేస్తారని, రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పిస్తామని, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, రాయలసీమకు బుందేల్ ప్యాకేజీ ఇస్తామని ప్రకటించాలన్నారు. లేని పక్షంలో వీటిపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సుందరయ్య నగర్ కార్యదర్శి శేఖర్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

దసరా పండుగ సీజన్‌ను ఆసరా చేసుకుని ప్రయాణికుల నుండి అధిక టికెట్ రేట్లు పెంచి వసూలు చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దసరా సీజన్లో ప్రయాణికుల ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు ఎక్కాలంటే భయపడుతున్నారన్నారు. పండుగ పేరుతో అధిక టికెట్ రేట్లతో నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటిపై అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్, నాయకులు యాసిన్ పాల్గొన్నారు.



ఎస్‌పికి శుభాకాంక్షలు తెలుపుతన్న ఎమ్మెల్సీ, బిటెక్ రవి, జోగిరెడ్డి

ఎస్‌పికి పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి పులివెందుల టౌన్/పులివెందుల రూరల్

నూతన ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన నచికేత్ విశ్వనాథ్‌ను మంగళవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పులివెందుల నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల తోపాటు, అసాంఘిక కార్యకాలపాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. అ సాంఘిక కార్యకలాపాల్లో ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని వారు ఎస్‌పికి విన్నవించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలే ముఖ్యమని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా పని చేస్తానని, మీకు ఏమైనా సమస్యలుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా తన దృష్టికి తేవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారిని గౌరవించాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఇప్పటికే పోలీసులకు సూచించానని పేర్కొన్నారు. ఎస్‌పిని ఘనంగా సన్మానించారు. జిల్లాలోని పరిస్థితులపై ఎస్‌పి వారితో చర్చించినట్లు సమాచారం.

యురేనియం బాధితులకు అండగా ఉంటా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

యురేనియం బాధితులకు అండగా ఉంటానని, ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం పవన్ కల్యాన్ దృష్టికి తీసుకెళతానని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం యురేనియం నిర్వాసిత ప్రాంతాలైన కేకే కొటాల, మబ్బుచింతలపల్లి ప్రజలు టెయిల్ పాండ్ ఎత్తు పెంచడం వల్ల నష్టం కలుగుతుందని, పరిహారం అందించాలని బీటెక్ రవితో కలిసి ఆర్‌డిఒను కోరారు. ప్రజలు ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరిగేలా అన్ని విధాలా అండగా ఉంటామని బిటెక్ రవి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు శ్రీనాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన ప్రజల వినతులను స్వీకరించారు. ఒకొక్కరి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నిటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నిటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వైసిపి పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలపై స్పందించిన పాపాన పోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రాజకీయాలకతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిసామని హామీ ఇచ్చారు, టిడిపి నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తెలుగుగంగ రైతుల్లో వైఎస్ఆర్ చిరస్మరణీయుడు

ప్రజాశక్తి - దువ్వూరు

తెలుగుగంగ రిజర్వాయర్ ఆయకట్టు భూములు సాగు చేసుకుంటున్న రైతుల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయుడని రైతు సంఘం నాయకులు సంఘన కిషోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగుగంగ రిజర్వాయర్ నుండి నీటిని వదిలి నేటికీ 21 ఏళ్లు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ వద్ద ఉన్న శిలాఫలకాన్ని రైతులతో కలిసి ఆయన సందర్శించారు. తెలుగుగంగ జలాశయం నుండి నీటిని వదిలినప్పటి నుండి ప్రతి ఏడాది రైతులు మూడు కార్లు పంటలు పండించుకుంటూ సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో బోర్లు వేసినప్పటికీ నీరు ఉండేది కాదన్నారు. నేడు ఆ సమస్య ఏ ఒక్క రైతుకూ లేదన్నారు. కార్యక్రమంలో రైతులు రామసుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, మాధవరెడ్డి, నన్నే బాషా పాల్గొన్నారు.

రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

ఎర్రగుంట్ల : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సున్నపురాళ్లపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మల్లు గోపాల్‌రెడ్డి రైతులను కోరారు. సొసైటీ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో 625 మంది సభ్యులు సుమారు రూ.20 కోట్ల రుణాలు పొందారని తెలిపారు. స్వల్ప, దీర్ఘ కాలిక రుణాలు పొందిన వారు వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోవచ్చని తెలి పారు. త్వరలో కొత్త రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సిఇ శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు లక్ష్మీనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉల్లి రైతులను తక్షణం ఆదుకోవాలి

చాపాడు : జిల్లాలో ఉల్లి సాగుచేసిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు, కడప జిల్లాలలో ఉల్లిపంట సాగు చేస్తారన్నారు. కడప జిల్లాలో 20 వేల ఎకరాలకుపైగా ఉల్లిపంట సాగుచేశారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉల్లిని కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

నృత్య పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

యునైటెడ్ స్కూల్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీలలో నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. జానపద నృత్యాలను ప్రోత్సహించడానికి పులివెందులలో జాతీయ నృత్య పోటీలను ప్రదర్శించినట్లు చెప్పారు. గ్రూప్ డ్యాన్స్‌లో మేఘన ప్రదర్శించిన లంబాడీ నృత్యానికి జాతీయ స్థాయిలో మూడవ స్థానం, సోలో డ్యాన్స్‌లో ముల్ల యాస్మిన్ రెండో స్థానాన్ని దక్కించుకున్నట్లు చెప్పారు. వీరికి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఏపి మార్క్‌ఫెడ్ చైర్మన్ శశిభూషన్‌రెడ్డి బహుమతులు అంద జేశారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను నారా యణరెడ్డి అభినందించారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR

I.A.No. 1864/23
O.S.No. 352/22

Banka Chandra Sekhar Reddy, S/o Banka Subba Reddy, Residing at D.No.1/139, Chinnasettypalle Village, Rajupalem Mandal, Kadapa District.
...Petitioner/Plaintiff

Vs

R5.Gowru Suhasini, W/o Vijaya Kumar, D/o Late Gowru Siva Rami Reddy, House wife, Residing at D/No.1/156-A, Chinnasettypalle Village, Rajupalem Mandal, Kadapa District.
...Respondent/Defendant No.5

నోటీసు

పై నెంబరు దావా యందు 1వ ప్రతివాది అయిన గౌరు శివరామిరెడ్డి గతించినందున వారి వారసులు అయిన నిన్ను చేర్చుటకు గాను పై I.A.ని దాఖలు చేసియున్నారు. అట్టి I.A. యందు R5 రెస్పాండెంటు అయిన నీకు ఆక్షేపణ లు ఉన్న ఎడల పై కోర్టు యందు 07.10.2025వ తేదీన ఉదయం 10.30ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలను తెలుపుకొనవలెయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా : 07.10.2025

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

B.V.RAMANA REDDY
Advocate, PRODDATUR

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR

I.A.No. 1865/23
O.S.No. 352/22

Banka Chandra Sekhar Reddy, S/o Banka Subba Reddy, Residing at D.No.1/139, Chinnasettypalle Village, Rajupalem Mandal, Kadapa District.
...Petitioner/Plaintiff

Vs

R4. Gowru Sravan Kumar Reddy, S/o Late Gowru Siva Rami Reddy, Hindu, Business.
R5.Gowru Suhasini, W/o Vijaya Kumar, D/o Late Gowru Siva Rami Reddy, House wife,
All are Residing at D/No.1/156-A, Chinnasettypalle Village, Rajupalem Mandal, Kadapa District.
...Respondents/Defendants R4 and R5

నోటీసు

పై నెంబరు I.A. యందు గౌరు వర్షిక మైనరు అయినందున లీగల్ రిప్రజెంటివ్ అయిన గౌరు స్వాతి గారిని గార్డియన్‌గా నియమించమని పిటిషన్ దాఖలు చేసియున్నాము. పై I.A. యందు R4 and R5 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 07.10.2025వ తేదీన ఉదయం 10.30ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా : 07.10.2025

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

B.V.RAMANA REDDY
Advocate, PRODDATUR

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR

I.A.No. 1863/23
I.A.No.540/22
O.S.No. 352/22

Banka Chandra Sekhar Reddy, S/o Banka Subba Reddy, Residing at D.No.1/139, Chinnasettypalle Village, Rajupalem Mandal, Kadapa District.
...Petitioner/Plaintiff

Vs

R4. Gowru Sravan Kumar Reddy, S/o Late Gowru Siva Rami Reddy, Hindu, Business.
R5.Gowru Suhasini, W/o Vijaya Kumar, D/o Late Gowru Siva Rami Reddy, House wife,
All are Residing at D/No.1/156-A, Chinnasettypalle Village, Rajupalem Mandal, Kadapa District.
...Respondents/Defendants R4 and R5

నోటీసు

పై నెంబరు I.A. యందు 1వ రెస్పాండెంటు అయిన గౌరు శివరామిరెడ్డి గతించినందున వారి వారసులు అయిన మిమ్ములను చేర్చుటకు గాను పై I.A.ను దాఖలు చేసియున్నారు. అట్టి I.A.యందు R4 and R5 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 07.10.2025వ తేదీన ఉదయం 10.30ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా : 07.10.2025

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

B.V.RAMANA REDDY
Advocate,
PRODDATUR

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR

O.S.No. 376/2023

1. Medamala SudhaRani, aged about 52 years, wife of late Narasimhulu, Hindu, House wife,
2. Medamala Uday Kumar, aged about 32 years, son of late Narasimhulu, Hindu, working as a Junior Assistant in S.P. Office.
3. Medamala Kiran Kumar, aged about 21 years, Son of late Narasimhulu, Hindu, Student.

Petitioner No.1 to 3 are residing in D.No.66/91, Mariyapuram, near ward Secreterate, Ravindranagar, Kadapa Town and District.
...Plaintiffs

Vs

3. Kovvuru Neelima, aged about 33 years, daughter of Hanumantha Reddy, Hindu, Housewife, residing at 20/631-A, Modampalli, Proddatur Town, Kadapa Dist.
...Defendant No.3

3వ రెస్పాండెంట్/ప్రతివాదికి దావాసమను మరియు నోటీసు

ఈ నెంబరు దావాలోని వాదులు, 1 నుంచి 3 ప్రతివాదులు పైన రాజశ్రీపై కోర్టు యందు దావా షెడ్యూలు ఆస్తి యందు వాదులకే హక్కు, బాధ్యతలు ఉన్నాయని దావా దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావాతోపాటుగా I.A.No.1478/2023 పిటిషన్ ద్వారా షెడ్యూలు ఆస్తిని అమ్మ కూడదని పిటిషన్ కూడా దాఖలు చేసియున్నారు. అట్టి దావాలో పిటిషన్‌లో 3వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన నీకు 16.10.2025నాడు వాయిదా ఉంటుఉన్నది. అట్టి తేదీ నాడు ఉదయం 10.30ని॥లకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెల్పుకోవలసినది. లేనంతట నీ పరోక్షమందు తీర్మాణించబడును.

వాయిదా తేది: 16.10.2025

//By Order of the Court//

పి. చంద్రశేఖర్
అడ్వకేట్, ప్రొద్దుటూరు.
కడప జిల్లా. సెల్: 9866635497.